నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 15 ఏప్రిల్ 2024 | NALGONDA

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నల్లగొండ, ఏప్రిల్ 14 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ హైదరాబాద్ వారు యూపీఎస్సీ మరియు సీశాట్‌కు 2025 పరీక్ష కోసం 2024-25 విద్యా సంవత్సరంలో 100 మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నది. ఈ శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, అన్ని రిజర్వ్ కేటగిరీలలో దివ్యాంగులకు 5శాతం సీట్లు కేటాయించడం జరుగుతుంది. హైదరాబాద్‌లోని మైనార్టీ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ శాఖ అధికారి విజయేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని, యూపీఎస్సీ-సీశాట్ 2025 యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని సాధారణ లేదా ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగి, అర్హులైన వారు ఆన్‌లైన్‌లో www.tmreis telangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 22 వరకు గడువు ఉన్నదని తెలిపారు. ఏప్రిల్ 28న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెం 040-23236112లో సంప్రదించాలని సూచించారు.

బాబా సాహెబ్‌కు ఘన నివాళి

రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల జరిగిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు.

నల్లగొండలో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జడ్పీచైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కాంగ్రెస్, బీజేపీలను నమ్మే పరిస్థితి లేదు

- రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నది.. కాంగ్రెస్‌వి ఆధారాలు లేని ఆరోపణలు
- ఒక్క తడికి నీళ్లివ్వాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోలే
- సాగర్ డెడ్‌స్టోరేజీలోనూ నీళ్లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌ది
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- మిర్యాలగూడలో బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం

మిర్యాలగూడలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నేతలు

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 14 : హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి వస్తున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నదని.. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తున్నదని మండిపడ్డారు. మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడ్ టీఎన్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎటుచూసినా ఎండిపోయిన పొలాలు, తాగునీటి సమస్యలతో రైతులు, ప్రజలు సతమతమవుతున్నా ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో, బయట కేసీఆర్‌ను, కేటీఆర్‌ను తిట్టడానికే తన పదవిని ఉపయోగిస్తున్నారన్నారు. 15రోజులుగా ప్రభుత్వ యంత్రాంగం ఫోన్ ట్యాపింగ్ అని రాద్ధాంతం చేస్తూ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం దివాళా తీసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అంటున్నాడని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఏం చేసిందని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రంగులు వేసి మరోసారి ప్రారంభించారే తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు మాయమాటలు చెప్పి పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తున్నాయని, వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ప్రజలు నిజానిజాలు తెలుసుకొని ఎవరి పాలన ప్రజారంజకంగా సాగిందో వారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. తమ ప్రభుత్వంలో నాగార్జునసాగర్‌లో నీటి మట్టం 505 అడుగుల డెడ్ స్టోరేజీలో ఉన్నా రైతుల క్షేమం కోరి సాగు నీటికి విడుదల చేశామని, 515 అడుగుల నీరు ఉన్నా కూడా కాంగ్రెస్ నీళ్ల ఇవ్వలేక చేతులెత్తేసిందని చెప్పారు. రైతులను కాపాడలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వంద అడుగుల లోతులో బొందపెట్టాలన్నారు. కాంగ్రెస్ మంత్రివర్గం రాష్ట్రంలోని ప్రతి రైస్ మిల్లు నుంచి రూ.2కోట్ల నుంచి రూ.3కోట్లు బెదిరించి వసూలు చేసి ఢిల్లీకి పంపించిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎంపీపీలు నూకల సరళాహన్మంతరెడ్డి, బాలూనాయక్, జడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ ఏఎంసీ చైర్మన్లు, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, పాలుట్ల బాబయ్య, మాజీ ఎంపీపీ పేలప్రోలు తిరుపతమ్మ, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.


సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి

- ఇప్పటికి 77,783 మెట్రిక్ టన్నులు సేకరణ
- కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 14 : ధాన్యం కొనుగోలులో ఇంకా వేగం పెంచి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచిస్తూ ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 370 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ధాన్యం సేకరణ వేగవంతంగా జరుగుతున్నదని తెలిపారు. ఇప్పటి వరకు రూ.171 కోట్ల రూపాయల విలువ చేసే 77,783 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. శనివారం నాటికి 12.66 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్, సహకార, డీఆర్డీఏ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయడంతోపాటు, రెవెన్యూ అదనపు కలెక్టర్, తాసీల్దార్లు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు, తూకం, తేమ కొలిచే యంత్రాలు, తూర్పార బట్టే యంత్రాలు, నీడ, తాగునీటి వసతులు కల్పించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కోటి రెండు లక్షల గన్నీ బ్యాగులను సిద్ధం చేశామని, అందులో 34 లక్షల బ్యాగులను కొనుగోలు కేంద్రాలకు పంపించామని తెలిపారు. తాసీల్దార్లు, డిప్యూటీ తాసీల్దార్లు కొనుగోలు కేంద్రాలతోపాటు వారి పరిధిలోని రైస్ మిల్లులను సందర్శించి ధాన్యం దించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షించి తనకు నివేదికలు పంపించాలని ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దించుకోవడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సీఎంఆర్‌ను సకాలంలో చెల్లించాలని మిల్లర్లను ఆదేశించారు.

ధాన్యం కొనుగోలులో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో 24 గంటలు పని చేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే 9963407064 నంబర్‌ను సంప్రదించాలని రైతులకు సూచించారు. ధాన్యాన్ని శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. సీరియల్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేశామని, కేంద్రాల్లో ఏ-2, ఇతర రిజిస్టర్ల నిర్వహణను పౌరసరఫరాల అధికారులు తనిఖీ చేస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసి ధాన్యం సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని ఆర్డీఓలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల తనిఖీల్లో రూ.9.17 కోట్లు స్వాధీనం

- నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి

నీలగిరి, ఏప్రిల్ 14 : లోక్‌సభ ఎన్నికల తనిఖీల్లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు రూ.9.17 కోట్లు సీజ్ చేశామని ఎస్పీ చందనాదీప్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దులైన వాడపల్లి, అడవిదేవులపల్లి టెయిల్‌పాండ్, నాగార్జున సాగర్ వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రా అధికారుల సమన్వయంతో అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులకు అనుబంధంగా ఎన్‌హెచ్ 65పై కేతేపల్లి టోల్‌ప్లాజా వద్ద, చిట్యాల పోలీసు స్టేషన్ పరిధిలో వట్టిమర్తి, మాల్, డిండి పోలీసు స్టేషన్ పరిధిలో అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పారామిలటరీ సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2.70కోట్ల నగదు, 23.10లక్షల విలువైన మద్యం, 22వేల విలువ గల గంజాయి, 5.73కోట్ల విలువ గల ఆభరణాలు, 51.62లక్షల విలువగల ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,17,94,000 సీజ్ చేసినట్లు వివరించారు.

తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే కఠిన చర్యలు

రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ అఫిడవిట్‌ను సమర్పించే సమయంలో అవినీతి కార్యకలాపాలకు పాల్పడితే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ చందనాదీప్తి హెచ్చరించారు. ఒక అభ్యర్థి ఎన్నికల్లో పోటీ చేయడానికి, నిలబడకుండా మానేయడానికి, తన అభ్యర్థిత్వం ఉపసంహరించుకోవడానికి లేదా ఉపసంహరించుకోకుండా కొనసాగడానికి, అభ్యర్థిగా తొలగడానికి ఏదైనా కానుక ఇవ్వడం, కానుక పొందడం, నామినేషన్ ఉపసంహరణకు, ఉపసంహరణ మానివేయడానికి చేసే అవినీతి కార్యకలాపాలకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం IPC సెక్షన్ 188 171B r/w 171E 120(B)ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 123(1) మరియు ఇతర చట్టాల ఉల్లంఘన కింద కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ఒకసారి అవకాశం ఇవ్వండి

గత ప్రభుత్వం 1.52 లక్షల ఎకరాలకు రైతుబంధు చెల్లించి రైతులను ఆదుకుంది. నేటి ప్రభుత్వం యాసంగి పంట చేతికొస్తున్నా 4 ఎకరాల లోపు వారికే మాత్రమే రైతుబంధు ఇచ్చి చేతులు దులుపుకుంది. నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. నన్ను పార్లమెంట్‌కు పంపిస్తే స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకు పంటలకు గిట్టుబాటు ధర అమలయ్యేలా కృషి చేస్తా. రైతుబంధు సక్రమంగా అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తా. ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండే పార్టీ బీఆర్ఎస్‌కు ఓటు వేసి నాకు ఒక అవకాశం ఇవ్వండి.

– కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం

గత ప్రభుత్వాన్ని విమర్శించడమే తప్ప కాంగ్రెస్ సర్కారు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద సాగు చేసిన వరి పొలాలు నీళ్లు అందక కండ్ల ముందే ఎండిపోతున్నా స్థానిక ఎమ్మెల్యేగానీ, జిల్లా మంత్రులుగానీ స్పందించలేదు. రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధరను మిల్లర్ల నుంచి ఇప్పించలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. గత ప్రభుత్వంలో యాదవులు రెండో విడుత గొర్రెల పంపిణీకి డీడీలు చెల్లించారని, వాటికి గొర్రెల యూనిట్లు ఇవ్వడం లేదని, డీడీలైనా తిరిగి ఇవ్వాలని లబ్ధిదారులు కోరినా కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం మా చేతిలో లేకున్నా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తాం. రైతులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టి, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేలా బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలి.

–నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే

గత పొరపాట్లను సరిచేసుకుందాం

గత శాసనసభ ఎన్నికల్లో చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతు బంధు ఎకరాకు రూ.15వేలు, కల్యాణలక్ష్మి రూ.లక్షతోపాటు తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు, నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఇస్తామని, ఆసరా పింఛన్లను రూ.4వేలకు పెంచుతామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసింది. గిరిజనులకు కేసీఆర్ ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇచ్చింది. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. గిరిజన జాతిని అక్కున చేర్చుకొని గౌరవించిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించాలి.

–బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

125 రోజుల్లోనే ప్రజలకు కాంగ్రెస్ చుక్కలు చూపించింది

125 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపించింది. ఇలాంటి పాలనపై ప్రజలు స్పందించాలి. రైతులు, ప్రజా సంక్షేమం కోరే బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలను గెలిపించాలి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల మాయమాటల్లో పడి ప్రజలు మోసం పోయారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలకు ఇప్పుడు పూర్తిగా అవగాహన వచ్చింది. ఈ ప్రభుత్వం మాకొద్దు బాబోయే అంటూ మొరపెట్టుకుంటున్నారు. ప్రజలు నిజాలు గ్రహించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి కాంగ్రెస్ బుద్ధి చెప్పాలి.

–బడుగుల లింగయ్యయాదవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు

కాంగ్రెస్ దొంగల పార్టీ

కాంగ్రెస్ అధికారం చేపట్టిన అనతి కాలంలోనే రాష్ట్రంలోని రైస్ మిల్లులపై పడి వందల కోట్లు దోచుకున్నది. మంత్రివర్గం దోపిడీ దొంగలుగా మారారు. రైతుల సమస్యల పట్ల సీఎం స్పందించకుండా వంద రోజుల పాలనలో 21సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారు. ఐపీఎల్ మ్యాచ్ చూశారు. ప్రజలు ఎన్ని కష్టాలు పడుతున్నా రేవంత్‌రెడ్డి దున్నపోతుపై వాన పడ్డ చందంగా ప్రవర్తిస్తున్నారు. గత ప్రభుత్వం, నేటి ప్రభుత్వ పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలు గ్రహించాలని, ప్రజల యోగ క్షేమం కోరిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలి.

– మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి

రూ.లక్షలు చెల్లించి.. రూ.కోట్లు వదిలి వేత

- మళ్లీ ధాన్యం వచ్చేలా బకాయి మిల్లర్ల ప్రయత్నాలు
- ఒకే యాజమాన్యం కింద ఉండే మిల్లుల్లో కుయుక్తులు
- సివిల్ సప్లయ్ కమిషనర్ ఆదేశాలు పాటించేనా?

సూర్యాపేట, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో రికార్డుల ప్రకారం వందల కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్‌గా సివిల్ సప్లయ్‌కి కొన్ని మిల్లులు చెల్లించాల్సి ఉండగా మళ్లీ వాటికే ధాన్యం వచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒకే యాజమాన్యం కింద ఉన్న మిల్లులు ఒక మిల్లుకు సంబంధించిన తక్కువ మొత్తం బకాయి చెల్లించి రూ.కోట్లలో బకాయి ఉన్న ఇతర మిల్లుల చెల్లింపులు చేయడం లేదు. కానీ డీపాల్ట్‌లో లేకుండా ఈ సారి యాసంగి ధాన్యం వచ్చేలా కుయుక్తులు పన్నుతున్నట్లు సమాచారం.

25 శాతం జరిమానా చెల్లించి..

గతంలో సకాలంలో ప్రభుత్వ సంస్థలకు బియ్యం ఇవ్వకపోవడంతో సర్కారు మిల్లులకు 25 శాతం జరిమానా విధించింది. మూడేండ్లుగా 25 శాతం జరిమానా చెల్లించని డీఫాల్ట్ మిల్లులు జిల్లాలో 34 ఉన్నాయి. వాటి బకాయి రూ.75 కోట్లకు పైనే ఉన్నది. 34 మిల్లులు గత రెండు సీజన్లుగా రూ.120 నుంచి రూ.200 కోట్ల ధాన్యం తీసుకొని ఒక్క గింజ బియ్యం తిరిగి ఇవ్వలేదు. ఈ సీజన్‌లో సివిల్ సప్లయ్ శాఖ కఠినంగా వ్యవహరిస్తూ డీఫాల్ట్ మిల్లులు, ఎక్కువ ధాన్యం నిల్వలు ఉన్న మిల్లులకు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం ఇవ్వొద్దని ఆదేశాలు జారీ చేసింది. దాంతో జిల్లాలో 25 శాతం జరిమానా ఉన్న కొంతమంది మిల్లర్లు సివిల్ సప్లయ్ శాఖకు బియ్యం ఇచ్చి ఈ సీజన్‌లో తిరిగి ధాన్యం తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వందల కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యం ఉన్న కొంతమంది మిల్లర్లు తమకు అనుకూలంగా ఉండే ఒకరిద్దరు అధికారులను పట్టుకొని కుయుక్తులు పన్నుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే జిల్లాలో కొన్ని యాజమాన్యాలకు రెండు నుంచి మూడు మిల్లులు ఉండగా అందులో రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల జరిమానా ఉన్న ఒక మిల్లుకు చెందిన 25 శాతం జరిమానా చెల్లించి, రూ.4 నుంచి 6 కోట్లు జరిమానా ఉన్న మిల్లులకు మాత్రం చెల్లించకుండా ఈ సీజన్‌కు సంబంధించి మరో వంద కోట్ల రూపాయల ధాన్యం తీసుకునేందుకు గత వారం రోజులుగా చర్చలు జరిపినట్లు కింది స్థాయి సిబ్బంది ద్వారా తెలిసింది. జిల్లాలో ఐదారుగురు యజమానులకు రెండు నుంచి మూడు మిల్లులు ఉండగా కొంతమంది ఇప్పటికే 25 శాతం జరిమానా చెల్లించి ధాన్యం కేటాయించిన మిల్లుల జాబితాలోకి చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఓ యజమానికి రెండు మిల్లులు ఉండగా గత రెండు సీజన్ల నుంచి అస్సలు బియ్యం ఇవ్వని ఓ మిల్లుకు సుమారు రూ.35 లక్షల విలువ చేసే 132 మెట్రిక్ టన్నుల బియ్యం 25 శాతం జరిమానా బకాయి ఉండగా దానికి సమానమైన బియ్యం ఇటీవల సివిల్ సప్లయ్‌కి ఇచ్చారు. మరో మిల్లుకు దాదాపు రూ.4 కోట్ల విలువ చేసే 14,135 మెట్రిక్ టన్నుల బియ్యం బకాయి ఉన్నది. లక్షల్లో బకాయి ఉన్న మిల్లు బకాయి చెల్లించి, కోట్లలో బకాయి ఉన్న మిల్లు బకాయి చెల్లించకుండా ఈ సీజన్ ధాన్యం తీసుకునే కుట్రలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

ఆ మిల్లులకు ధాన్యం కేటాయిస్తే చర్యలు

జిల్లాలో కొంతమంది అక్రమార్కుల కుయుక్తులను పసిగట్టిన రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ ధాన్యం కేటాయింపుల్లో తేడాలు ఉంటే కఠిన చర్యలు తప్పవని అధికారులకు తీవ్ర స్థాయిలో మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఇప్పటికే గత రెండు సీజన్ల నుంచి జిల్లాలో అసలు సీఎంఆర్ బియ్యం ఇవ్వని 12 మిల్లులతోపాటు అత్యధిక బకాయి ఉన్న మరో 25 మిల్లులకు ఈ యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కేటాయింపులు చేయొద్దని ఆదేశాలు అందాయి. ఎట్టి పరిస్థితుల్లో భారీగా ధాన్యం నిల్వ ఉన్న మిల్లులతోపాటు ఒకే యాజమాన్యం కింద రెండు మూడు మిల్లులు ఉంటే ఏ ఒక్క మిల్లు డీఫాల్ట్ ఉన్నా ధాన్యం ఇవ్వొద్దనే ఆదేశాలు ఉన్నాయి.

దాంతో ఐదారు మంది అక్రమార్కులు ఏకమై వారు అనుకున్నట్లు జరుగకపోవడంతో మిల్లర్లంద రికీ ఏదో అన్యాయం జరుగుతున్నట్లు చిత్రీకరించి ప్రభుత్వం, సివిల్ సప్లయ్ శాఖకు వ్యతిరేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయాలనే ఆలోచన చేయగా మెజారిటీ మిల్లర్లు వ్యతిరేకించడంతో ఆ ఆలోచన ముందుకు సాగడం లేదని పలువురు మిల్లర్లు పేర్కొంటున్నారు.

రామానంద సంస్థకు మహర్దశ

- స్కిల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- 100 ఎకరాల్లో సంస్థ.. ఇప్పటికే ఎంతో మందికి శిక్షణ
- వసతులపై సమగ్ర నివేదికకు అధికారుల దృష్టి

స్వామి రామానంద గ్రామీణ సంస్థ

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 14 : స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థకు మహర్దశ కలుగనున్నది. దీనిని స్కిల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఉపాధి కల్పన పారిశ్రామిక అవసరాలకు మానవ వనరులను తయారు చేసేందుకు రాష్ట్రంలో 10 స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని సర్కారు భావించింది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను స్కిల్ యూనివర్సిటీగా మార్చేందుకు పంచాయతీరాజ్ శాఖను ప్రభుత్వం ఆదేశించింది. సంస్థలో ఉన్న సౌకర్యాలపై సమగ్ర నివేదిక అందించాలని సూచించింది. ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు గుజరాత్, హర్యానా, రాజస్థాన్, ఒడిశా, ఆంధ్రా రాష్ట్రాల్లో సంబంధిత శాఖ అధికారులు అధ్యయనం చేయనున్నారు.

అన్ని అనుకూలతలు..

స్వామి రామానంద సంస్థలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అన్ని అనుకూలతలు ఉన్నాయి. 100 ఎకరాల విశాలమైన స్థలంలో సంస్థను నెలకొల్పారు. మొత్తం పది భవనాలు ఉన్నాయి. అకాడమిక్ భవనంతోపాటు 4 కంప్యూటర్ ల్యాబ్‌లు, నాలుగు వర్క్ షాపులు, 400 మందికి సరిపడా నాలుగు హాస్టల్ భవనాలు ఉన్నాయి. రామానంద సంస్థను యూనివర్సిటీ స్థాయిలో తీర్చిదిద్దితే మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నది. లోక్ సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కార్యాచరణ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నది. సంస్థను అప్‌గ్రేడ్ చేసి త్వరలో 30 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వపరంగా కల్పించనున్నారు.

వివిధ కోర్సుల్లో శిక్షణ

స్వామి రామానంద గ్రామీణ సంస్థలో 7, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతతో కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, డీటీపీ, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, సెల్‌ఫోన్ మెకానిక్, ఎకౌంట్ అసిస్టెంట్, సోలార్ ఎనర్జీ, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి